క్లుప్తంగా

వైఎస్సార్‌టీఏ నేత కుటుంబానికి పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి

తలుపుల : ఓదులపల్లికి చెందిన వైఎస్సార్‌టీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఇంద్రప్రసాద్(45) గుండె పోటుతో మంగళవారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని ఇంద్రప్రసాద్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి భార్య నీలావతి, తల్లిదండ్రులు, కుమారులను పరామర్శించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. చిన్న వయసులోనే ఇంద్ర ప్రసాద్ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

యలవ గంపకు ప్రత్యేక పూజలు

తాడిమర్రి: మండలంలోని ఎం.అగ్రహారం, మరవపల్లి, తాడిమర్రి, కునుకుంట్ల, రామాపురం గ్రామాల మీదుగా నార్పల మండలం ముచ్చుకుంటపల్లికి వెళ్లిన వీరనారాయణ స్వామి యలవ గంపకు ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రామాపురం గ్రామానికి చెందిన ఆలయ పూజరులు బుధవారం పుట్టపర్తి మండలం పాముదుర్తిలోని పవిత్ర కోనేరులో ఉంచిన వీరనారాయణస్వామి ప్రతిమను ప్రత్యేకంగా వెదురు బుంగలతో గుడి కట్టు దారులు స్వయంగా అల్లిన యలవ గంపలో స్వామిని ఉంచి ఉపవాసంతో కాలి నడకన ముచ్చుకుంటపల్లికి తీసుకెళ్లారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి విఫలయత్నం

నల్లచెరువు: ఉబిచర్ల గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం అర్ధరాత్రి విఫలయత్నం చేశారు. స్థానికులు తెలిపిన వివరాలు..గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి అందులోని విలువైన వైరు కాపర్ వైరు చోరీ చేసేందుకు గుర్తు తెలియని వ్యక్తులు ప్రయత్నించారు. గ్రామస్తులు గమనించి కేకలు వేయడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ షెక్షావలి తెలిపారు.

వీరనారాయణస్వామి పరుషకు భారీ పోలీస్ బందోబస్తు




సూచనలు ఇస్తున్న సీఐ శివరాముడు

ముదిగుబ్బ: సంకేపల్లి సమీపాన పరుషమాండ్లలో గురువారం జరుగనున్న వీరనారాయణ స్వామి పరుషకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరుషలో భాగంగా పెద్ద ఎత్తున ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు ప్రదక్షిణలు జరుగుతాయి. ఇక్కడ గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని సీఐ శివరాముడు ఆధ్వర్యంలో గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇదిలా ఉండగా పరుష జరిగే ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, పశువైద్య సిబ్బంది వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు.

విద్యుత్ ఏఈగా సాయినాథ్

పుట్టపర్తి టౌన్: స్థానిక విద్యుత్ కార్యాలయంలో టౌన్ ఏఈగా సాయినాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న నారాయణమ్మ అనంతపురం ఏఈగా వెళ్లారు. దీంతో ఆమె స్థానంలో నల్లమాడ ఏఈగా పనిచేస్తున్న సాయినాథ్‌ను ఇక్కడికి నియమించారు. ఈసందర్భంగా నూతన ఏఈ మాట్లాడుతూ వినియోగదారులకు నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన సేవలందిస్తానన్నారు. ఏఈకి విద్యుత్ సిబ్బంది సిబ్బందితో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

2న కంటి వైద్య శిబిరం



కరపత్రాలు విడుదల చేస్తున్న సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మార్చి 2న బెంగళూరు నేత్రజ్యోతి కంటి ఆసుపత్రి వైద్యులతో కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, క్యాంపు చైర్మన్ పోలా ప్రభాకర్ తెలిపారు. పట్టణంలోని స్వాతిక్లినిక్‌లో బుధవారం శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. కంటిచూపు తగ్గినవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువర్స్ ఫౌండేషన్ పీఆర్‌ఓ సి.రాధాకృష్ణ, మాజీ ప్రెసిడెంట్ వైకే శ్రీనివాసులు, సభ్యులు చాంద్‌బాషా, బండి నాగేంద్ర, సత్రసాల మల్లికార్జున, పెనుజూరు నాగరాజు, ఎస్‌వి ప్రసాద్, బాలం ఆదిశేషులు, రామంజనేయులు ఉన్నారు.

పరమేశ్వరా పాహిమాం

- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- ఆలయాల్లో మార్మోగిన శివనామస్మరణ

బత్తలపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని శివాలయాలు, వివిధ ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. రామాపురం, మాల్యవంతం, సంగమేశ్వర క్షేత్రం, కాటికోటేశ్వర క్షేత్రాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘమేశ్వర క్షేత్రంలో పంచరత్నాలు, బత్తలపల్లిలోని లలితా త్రిపుర సుందరీ ఓంకారేశ్వరస్వామి ఆలయం వద్ద నవరత్నములు, మాల్యవంతం గ్రామంలో నాటక ప్రదర్శన చేపట్టారు. పోట్లమర్రి, ముష్టూరు శివాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు, గంటాపురం అప్పస్వామి, డి.చెర్లోపల్లిలోని సిద్దేశ్వరాలయం, దంపెట్లలోని చెన్నకేశవాలయం, యర్రాయపల్లిలోని సంగాలప్ప స్వామి ఆలయాల్లో శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పోట్లమర్రి శివాలయంలో అన్నదానం చేపట్టారు. రామాపురంలో వీరనారాయణ స్వామి ఆభరణాలను ఊరేగించారు.

కదిరి టౌన్: మహా శివరాత్రి సందర్భంగా పట్టణంలో శివాలయం, సైదాపురం ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న శివాలయం, ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ ఆలయమైన శివాలయంలో ఉదయం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు క్యూలైన్లో ఉండి స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

తలుపుల : మహాశివరాత్రి సందర్భంగా బుధవారం మండలంలోని శివాలయాలు భక్తుల ఓంకారాలతో మార్మోగాయి. ఓబీఆర్ రోడ్డులోని శివాలయం, ఓదులపల్లి శివాలయం, నామాల గుండు వద్ద గల సిద్ధలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అందజేశారు. ఆయా ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని శివాలయంలో బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భ్రమరాంబికా, మల్లికార్జునస్వామి దర్శనానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం గణపతి పూజ, నవగ్రహ పూజ, రుద్రాభిషేకం, ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. ధనియానిచెరువు భైరవేశ్వరస్వామి ఆలయం, గొకనపల్లి, పెడబల్లి శివాలయాల్లో స్వామి వారికి అర్చకులు పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రామగిరిలో... రామగిరి: మండల వ్యాప్తంగా మహాశివరాత్రి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీపల్లి, నసనకోట, మాదాపురం, రామగిరి, కుంటిమద్ది, పోలేపల్లి, గంతిమర్రి పంచాయతీల్లోని శివాలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. పేరూరులోని భోగేశ్వరస్వామి, రామగిరిలోని కాశీవిశ్వనాథస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు పానకాలు, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఓడీచెరువు: శివరాత్రిని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాల్లో బుధవారం శివనామస్మరణ మార్మోగింది. స్థానిక బస్టాండుకూడలిలోని శివాలయంలో బొడ్డు నాగరాజు దంపతులు శివపార్వతుల కల్యాణం జరిపించారు. ఎం.కొత్తపల్లి బండపై ఇటీవలే నిర్మించిన శివాలయంలో శ్రీశైలం తరహాలో స్పర్శ దర్శనం చేసుకునే వీలు కల్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. రాత్రి జాగారణలో భాగంగా భజన, చెక్కభజనలు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా బోడిగుండ్లపల్లిలో వెలసిన అక్కదేవతలకు యలవగంప ఉత్సవం నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో గురువారం ఉట్ల పరుష నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.



కదిరి శివాలయం వద్ద క్యూలో వేచి ఉన్న భక్తులు



కదిరిలో ప్రత్యేక అలంకరణలో శివలింగం



సంగమేశ్వర క్షేత్రంలో విశేష పూజలందుకుంటున్న శివుడు



బత్తలపల్లిలో విశేష పూజలందుకుంటున్న ఓంకారేశ్వరుడు



ఎన్పీకుంట శివాలయంలో పూజలందుకున్న స్వామి వారు



మాల్యవంతంలో వీరనారాయణస్వామి ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం



తలుపుల మండలం నామాలగుండు సిద్ధిలింగేశ్వర ఆలయంలో పురాణపఠనం చేస్తున్న దృశ్యం



బత్తలపల్లి మండలం గంటాపురంలో పూజలందుకుంటున్న గురుజాల అప్పస్వామి మూలవిరాట్



రామగిరి: పూజలందుకుంటున్న కాశీవిశ్వనాథస్వామి

కోన క్షేత్రంలో ప్రత్యేక పూజలు

చెన్నేకొత్తపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని బుధవారం మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శివనామస్మరణతో శివాలయాలు ప్రతిధ్వనించాయి. చెన్నేకొత్తపల్లి సమీపంలోని కోన క్షేత్రంలో వెలసిన కోన మల్లేశ్వరస్వార స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల దర్శనార్థం స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే చెన్నేకొత్తపల్లిలోని కాశీ విశ్వనాథాలయంలో స్వామి వారికి, కనుముక్కల గ్రామంలోని గుమ్మనాథేశ్వరాలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. కనుముక్కల సమీపంలోని కొండల్లో కొలువైన గుండాల మల్లికార్జున స్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోన కణ్వాశ్రమం, చెన్నేకొత్తపల్లిలోని శివాలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ముదిగుబ్బ: మండలంలో బుధవారం మహాశివరాత్రి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా హరిహర దేవాలయంలో శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకల గొందిలోని శివాలయం, పాతూరి పెద్దమ్మ ఆలయంలో విశేష పూజలు జరిగాయి. రాత్రి పెద్దమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఊరేగించారు. పూజారి రఘునాథశాస్త్రి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.



ఓడీచెరువు శివాలయంలో శివపార్వతుల కల్యాణం

ధర్మవరం రూరల్: మండలంలో బుధవారం మహా శివరాత్రి వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కుణుతూరు, పోతుకుంట, పోతులనాగేపల్లి, గొట్లూరు, సుబ్బరావుపేట, నాగలూరు, మల్లేనిపల్లి, తుమ్మల, చిగిచెర్ల, వసంతపురం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో శివునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కనగానపల్లి: మండలంలోని శివాలయాలన్నీ బుధవారం ఓంకార నాదంతో మార్మోగాయి. కనగానపల్లిలోని మల్లికార్జునస్వామి, తగరకుంటలోని మల్లన్నస్వామి, ముక్తాపురంలోని ముక్తీశ్వరాలయం, పర్వతదేవరపల్లిలో మల్లికార్జున స్వామి దేవాలయాల వద్ద ఉదయం నుంచి భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజామున నుంచే శివలింగాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శివమాలధారులు, ఉపవాస దీక్షల్లో ఉన్న భక్తులు ఆలయాల వద్దకు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాడిమర్రి: తాడిమర్రిలోని పురాతన శివాలయం, భైరవేశ్వర ఆలయం, చిల్లవారిపల్లి, చిల్లకొండయ్యపల్లి, కునుకుంట్ల, పిన్నదరి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామికి పూజలు నిర్వహించి, భజనలతో రాత్రి అంతా జాగరణ చేశారు.

కాశీ విశ్వనాథుడికి ప్రత్యేక పూజలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చెరువుకట్ట సమీపంలోనున్న కాశీ విశాలాక్షి సహిత కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో బుధవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం పేట బసవన్నకట్టవీధిలోని త్రిలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయా ఆలయాల అర్చకులు, కమిటీ సభ్యులు జడ్జి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఇదిలా ఉండగా శివానగర్ బచ్చునాగంపల్లి కాశీవిశ్వనాథస్వామి ఆలయం, గాంధీనగర్ సహస్ర సిద్దరామలింగేశ్వరస్వామి ఆలయం, గీతానగర్ శివాలయం, చెరువుకట్ట చక్రసమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎరగుంటకు వెళ్లేదారిలోని అరిగెల పోతన్న రైస్‌మిల్ పక్కనున్న శివకేశవ ఆలయంలో శివునికి అరిగెల వంశస్థులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. కొత్తపేట ఉమామహేశ్వరస్వామి ఆలయంలో మున్సిపల్ కౌన్సిలర్ చందమూరి నారాయణ రెడ్డి దంపతులు పార్వతి, పరమేశ్వరుల కల్యాణోత్సవం జరిపించారు. చక్రవర్తి థియేటర్ వద్ద నున్న కాలభైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు శివాలయాలలో దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.



కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి కుటుంబ సభ్యులు



ప్రత్యేక అలంకరణలో ఉమా నీలకంఠేశ్వర స్వామి



ప్రత్యేక అలంకరణలో గౌరీ ప్రసన్నేశ్వర స్వామి



అలంకరణలో సీకేపల్లి కాశీవిశ్వనాథుడు



ప్రత్యేక అలంకరణలో కనుముక్కలలోని గుమ్మనాథేశ్వరుడు



ముదిగుబ్బలో శివునికి పూజలు చేస్తున్న దృశ్యం



కుణుతూరులో పూజలందుకున్న చంద్రమౌళేశ్వరస్వామి

చిగురిస్తున్న ఆశలు..

అనుకోని తుపాన్లు, మంచు ప్రభావంతో జనవరి చివరి వరకు మామిడి తోటల్లో పూత కనిపించలేదు. వాతావరణ పరిస్థితులు మారడం, ఎండ ప్రభావానికి కొంత ఆలస్యంగా పూత వస్తుండడంతో రైతులు దిగుబడులపై ఆశలు పెట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా పూత, పిందె దశలలో ఉన్న మామిడి తోటలు కనిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 38,594 ఎకరాల్లో పలు రకాల మామిడి సాగవుతోంది.

- పూత, పిందె దశలో మామిడి
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు

ధర్మవరం రూరల్: జిల్లాలోని మామిడి తోటల్లో ఈ ఏడాది ఆలస్యంగా పూత మొదలైంది. సాధారణంగా డిసెంబర్, జనవరిలోనే పూత కనిపించాలి. అయితే ఈసారి ఫిబ్రవరి నెల చివరలో పూత రావడం కనిపిస్తోంది. చాలా మండలాల్లో పూత రాలిపోకుండా వేగవంతంగా పురుగుమందు పిచికారీ చేస్తూ కాపాడుకునే ప్రయత్నాలు సాగిస్తున్నారు.

ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లో సాగు వివరాలు	
మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
ధర్మవరం	1,045
బత్తలపల్లి	305
తాడిమర్రి	458
ముదిగుబ్బ	2,525
కనగానపల్లి	948
చెన్నేకొత్తపల్లి	830
రామగిరి	395



ఏలుకుంట్లలో పూతకొచ్చిన మామిడి తోట

మన మామిడికి భలే డిమాండ్

జిల్లాలో మామిడి సాగు విస్తీర్ణం ఏటా గణనీయంగా పెరుగుతోంది. మన ప్రాంతంలో బేనీషా, తోతాపురి, బెంగళూరు, నీలం, మల్లికా, ఇమామ్, మలగూబ, రసాలు తదితర రకాలను ఎక్కువగా పండిస్తున్నారు. ఈ ప్రాంతంలో పండించే బేనీషా నాణ్యతతో పాటు రంగు, రుచి ఉండడంతో వాటికి మంచి డిమాండ్ ఉంది. దీంతో వ్యాపారులే తోటల వద్దకు వచ్చి కాయలు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. మామిడి కాయలు మార్చి నుంచి జూన్ వరకు సుమారు నాలుగు నెలల పాటు మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉంటాయని రైతులు చెపుతున్నారు.

ఆలస్యంతో ఆందోళన!

ఈ ఏడాది మామిడిలో పూతలు చాలా ఆలస్యంగా వచ్చాయి. ఇప్పుడు వస్తున్న పూతలకు ఏప్రిల్, మే నెలలో కాయలు కోతకు వస్తాయి. మే నెల ఆరంభంలో గాలి, వానలు ఉండే అవకాశం ఉంది. అప్పటిలోగా కోతలు పడితే రైతులు నష్టపోరు. ఒక వేళ గాలి వానలు వస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారు. ఈ ఏడాది మామిడికి బీమా సౌకర్యం ఉన్నా ప్రీమియం మొత్తం చాలా ఎక్కువగా ఉండడంతో బీమా చేయలేకపోయాం

– చంద్రశేఖర్, మామిడి రైతు, ధర్మవరం

పంటపై ప్రత్యేక శ్రద్ధ పెట్టా

గత నెల జనవరి వరకు తోటలో పూతలే కనిపించలేదు. ప్రస్తుతం తోట పూతతో కళకళలాడుతోంది. పూత రాలకుండా మూడు రోజుల క్రితమే మందు పిచికారీ చేశాను. ప్రస్తుతం ఎండలు బాగున్నాయి. పూత దశ నుంచి కాయదశకు త్వరగా చేరుకుంటుంది. పంటపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చూసుకుంటున్నాను.

– లక్ష్మన్న, మామిడి రైతు, ఏలుకుంట్ల

సస్య రక్షణతోనే మంచి దిగుబడులు

మామిడి తోటలు పూత, పిందె దశలో ఉన్నాయి. ఈ దశల్లో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు వస్తాయి. ఇప్పటికే మామిడి రైతులకు పలుసార్లు అవగాహన సదస్సులు పెట్టి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాం. రైతులకు ఎటువంటి సందేహాలు ఉన్నా స్థానిక ఉద్యాన సిబ్బందిని సంప్రదించవచ్చు.

– అమరేశ్వరి,ఉద్యానశాఖ అధికారి, ధర్మవరం

వైభవం...కాశీ విశ్వనాథస్వామి రథోత్సవం



భక్తులకు అన్నం వడ్డిస్తున్న వన్ టౌన్ ఎస్ఐ కేతన్న

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శివానగర్ అతి పురాతనమైన బచ్చునాగంపల్లి కాశీ విశ్వనాథ స్వామి రథోత్సవం బుధవారం వైభవంగా సాగింది. పార్వతి, పరమేశ్వరులను ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం 4 గంటలకు రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు శివానగర్‌లోని దిమ్మెల సెంటర్ వరకు రథాన్ని లాగారు. రథోత్సవాన్ని తిలకించేందుకు పట్టణ ప్రజలు భారీగా తరలివచ్చారు. వీఎస్‌వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వన్‌టౌన్ ఎస్ఐ కేతన్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, బీజేపీ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

రేపు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

అమడగూరు: అమడగూరులోని చౌడేశ్వరీ కల్యాణమండపంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు కిసాన్ మోర్చా ఆర్గానిక్ సెల్ స్టేట్ కన్వీనర్ చింత శరత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని కోరుకునే రైతులు ఈ శిక్షణలో పాల్గొనాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9014367896, 8008554500, 9912220726
9010593486, 9912220717